ప్రజాశక్తి

సోమవారం 18 సెప్టెంబర్ 2023 12 పేజీలు



గుంటూరు



పల్నాడు

కౌల్దారుకు అరకొర రుణం



- సిసిఆర్‌సిలు జారీలోనే తొలగని అడ్డంకులు
- పెరిగిన పెట్టుబడితో భారంగా సేద్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భూమి ఉన్న రైతుల కంటే భూమి లేని కౌలు రైతులు మరింత సంక్షోభంలో చిక్కుకున్నారు. వాణిజ్య పంటలు అధికంగా పండే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈ ఏడాది కౌలు ధరలు గణనీయంగా పెరిగాయి. పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఆదాయం తగ్గిపోతోంది. దీంతో ఈ ఏడాది సాగుకు కౌలు రైతులు చాలా గ్రామాల్లో ముందుకు రావడంలేదని చెబుతున్నారు. ఒకవైపు వర్షాభావం, మరోవైపు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, వర్షా భావ పరిస్థితులతో సేద్యం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రస్తుతం గుంటూరు, పల్నాడు జిల్లాలో 8.37 లక్షల ఎకరాలలో ఈ ఏడాది పంటలు వేస్తారని అంచనా ఉండగా ఇప్పటివరకు 4.35 వేల ఎకరాల్లోనే పంటలు వేశారు. దాదాపు 4 లక్షల ఎకరాల్లో ఎటువంటి పంటలు లేక భూములు ఖాళీగా ఉన్నాయి. సేద్యం ఊపందుకోకపోవడానికి వర్షాభావం ఒక కారణమైతే కౌలు రైతులు కూడా ముందుకు రాకపోవడం కూడా మరో కారణంగా అధికారులు చెబుతున్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి కౌలురైతులకు తగిన భరోసా కొరవడటమే ప్రధాన కారణంగా నిలుస్తోంది.

కౌలు రైతులకు మెరుగ్గా ఉన్న 2011 కౌల్దారి చట్టాన్ని తొలగించి వైసిపి ప్రభుత్వం 2019లో కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు ఏ సాయం కావాలన్నా భూ యజమాని అంగీకారం తప్పని సరిగా మారింది. భూ యజమాని అంగీకారపత్రంతో సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలనే నిబంధనల మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సాగు ధ్రువీకరణ పత్రాలు (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగడం లేదు. సాగు ధ్రువీకరణ పత్రాలు అధికారులు జారీ చేసినా బ్యాంకర్లు మాత్రం రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు. గుంటూరు జిల్లాలో 50 వేల మందికి సిసిఆర్‌సిలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఈ ఏడాది 33,014 మందికి సిసిఆర్‌సిలు ఇచ్చారు. కేవలం 2032 మంది కౌలు రైతులకు రూ.14.45కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చారు. పల్నాడు జిల్లాలో 56,613మందికి సిసిఆర్‌సిలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 46,732 మందికి అందించారు. వీరిలో ఐదు వేలమందికి రూ.30 కోట్ల మేరకు రుణాలు ఇచ్చారు. దాదాపు 10శాతం మందికే రుణాలు ▶ 2లో



బాధిత పేదలతో మాట్లాడుతున్న పాశం రామారావు

పేదల ఇళ్ల జోలికొస్తే ఊరుకోం : సిపిఎం

- నోటీసులు జారీ చేసిన ప్రాంతంలో నాయకులు పర్యటన
- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-తాడేపల్లి

పేదల ఇళ్లజోలికొస్తే ఊరుకునేదిలేదని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు హెచ్చరించారు. మంగళగిరి నియోజకవర్గంలో ముఖ్యంగా తాడేపల్లి ప్రాంతంలో ఎర్రజెండా అండతోనే పేదలకు ఇళ్ల దక్కాయని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలోని అమరారెడ్డినగర్, యానాదుల కాలనీ, ఉండవల్లి తదితర ప్రాంతాల్లో ఇరిగేషన్ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్లుఖాళీ చేయాలని ఇటీవల ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులపై గత నెలలో వేసిన తేదీలను కొట్టి వేసి ఈనెలకు సంబంధించిన తేదీలు వేసి పంపిణీ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో అధికారులు నోటీసులు జారీ చేసిన పేదల పేటల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎంత వరకు పనికిరాని ఇరిగేషన్, పోరంబోకు భూముల్లో సుమారు వెయ్యి కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. 40 ఏళ్ల క్రితం కమ్యూనిస్టుల కృషి, చొరవ అనేక కేసులు ఎదుర్కొని పేదల గూడు నిలబెట్టారని గుర్తు చేశారు. ▶ 2లో



సెల్ఫీ క్యాంప్‌లో పాల్గొన్న మేయర్, కమిషనర్, ఎమ్మెల్యే, ప్రజలు

3978 మందితో స్వచ్ఛలీగ్ మెగాసెల్ఫీ

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 లో భాగంగా ఆదివారం నగరంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 3978 మంది యువతతో మెగా సేల్ఫీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నాయని, గుంటూరు నగరాన్ని కూడా స్వచ్ఛ, ఆరోగ్య నగరంగా మార్చుకోవడంలో నగర ప్రజల భాగస్వామ్యంతో అధికారులు, పాలకవర్గం విశేష కృషి చేస్తుందన్నారు. నగరపాలక సంస్థ తీసుకున్న చర్యల వలన ఇటీవల జాతీయ స్థాయిలో నగరానికి స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో 3వ ర్యాంక్‌తో గుర్తింపు లభించిందన్నారు. ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో చేపట్టిన జిఎంసి మెగా సెల్ఫీకి నగరంలోని యువత నుండి అనూహ్యమైన స్పందన లభించిందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతపై నగర ప్రజల్లో అవగాహన పెంచేందుకు చేపట్టిన ఇండియన్ స్వచ్ఛత లీగ్ ▶ 2లో



ఎస్ఎఫ్ఐ గర్ల్స్ నూతన కన్వీనింగ్ కమిటీ

నినాదాలకే పరిమితమైన బేటీ బచావో.. బేటీ పడావో

- సనాతనం పేరుతో మహిళను వంటింటికే పరిమితం చేసే కుట్ర
- ముగిసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్

సిబిఐ కూడా న్యాయం చేయలేదు

- సిబిఐ బృందంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయేషామీరా తల్లిదండ్రులు
- స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరణ
- నివేదిక ఏమైందంటూ నిలదీత

మెయిన్‌లో

అక్రమ వ్యాపారాలపై నిఘా

- రేషన్ బియ్యాన్ని దారిమళ్లిస్తే చర్యలు
- నకిలీ టీ పొడి విక్రేతలపై దృష్టి
- బయోఉత్పత్తులపై విస్తృత తనిఖీలు
- ప్రజాశక్తితో విజిలెన్స్ ఎస్‌పి ఈశ్వరరావు

8లో

కౌల్దారుకు అరకొర రుణం

(మొదటి పేజీ తరువాయి)

అందుతున్నాయి. మిగతా వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

సి.సి.ఆర్.సిలు లేకపోవడం వల్ల చాలా మందికి రైతు భరోసా, పంటల బీమా వంటి సదుపాయాలు అందడం లేదు. సిసిఆర్‌సిలు ఉన్న ఓసి రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం లేదు. బీమా సదుపాయం సొమ్ము భూ యజమాని ఖాతాల్లో జమవుతోంది. ఈ సొమ్ము కౌలు రైతులకు ఇవ్వాలనే కనీస ధ్యాస కొంత మందికి ఉండటం లేదు. గ్రామాల్లో పెద్దల సమక్షంలో చర్చిస్తే కొంత మంది తన పొలంలో సాగు చేసిన కౌలు రైతుకు బీమా సొమ్ము ఇస్తున్నారు. కొంత మంది ఇవ్వడం లేదన్న విమర్శఉంది. ప్రభుత్వం సేద్యానికి అందిస్తున్న సబ్సిడీలు కౌలురైతుకు అందడం లేదు. పండించిన పంటను అమ్ముకోవాలన్నా గుర్తింపు కార్డు లేక భూ యజమాని పేరుతోనే అమ్ముకోవలసి వస్తోంది. కొంతమంది అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఈ-క్రాప్, ఇకెవైసి సదుపాయం కౌలు రైతులందరికి లేకపోవడం వల్ల వీరికి ప్రభుత్వం నుంచి నేరుగా రావాల్సిన వివిధ సదుపాయాలు అందడం లేదు.

3978 మందితో స్వచ్ఛలీగ్ మెగాసెల్ఫీ

(మొదటి పేజీ తరువాయి)

2.0లో 3978 మంది యువత పెద్ద ఎత్తున పాల్గొనడం ద్వారా దేశంలో ఎక్కడా లేని సెల్ఫీ రికార్డ్ నమోదు అయ్యిందన్నారు. గతంలో చత్తీస్‌ఘడ్ నిట్‌లో 2200 మంది విద్యార్థులదే ఇప్పటి వరకు రికార్డ్ అని అన్నారు. అదే విధంగా గత రెండు రోజులుగా నగరంలోని విద్యా సంస్థల్లో నిర్వహించిన ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో 13 వేల మంది రిజిస్టర్ చేసుకోవటం ద్వారా అత్యధిక రిజిస్ట్రేషన్ చేయించిన నగరంగా గుంటూరు నిలిచిందన్నారు. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రతతో పాటుగా, వ్యర్థాలను రోడ్ల మీద, కాల్వల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకే ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా నగరాలూ స్వచ్ఛ, ఆరోగ్య నగరాలుగా మారుతున్నాయన్నారు. అనంతరం మేయర్ స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజిల, అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఇ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఒ డాక్టర్ భానుప్రకాష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జిఎంసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2000 మట్టి విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి

పల్లెటూరు ట్రస్ట్, తాడేపల్లి ప్రెస్ క్లబ్, దీక్ష మీడియా ఆధ్వర్యంలో 2 వేల మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, మాజీ సర్పంచ్ జొన్న శివశంకర్ పాల్గొని ప్రతిమలను అందించారు. ట్రస్ట్ చైర్మన్ రాజేష్, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు మీరావాలి, డాక్టర్ జి.కన్నారావు నాయుడు, వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ నారాయణ, టి.సాంబశివరావు, సాంబశివరావు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

వడ్లమూడిలో షాదీఖానా ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం అంజద్ బాషా

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు వివక్షత లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధిని వైసిపి ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ వ్యవహారాల శాఖమాత్యులు షేక్ బెపారి అంజాద్ బాషా అన్నారు. ఆదివారం చేబ్రోలు మండలం వడ్లమూడిలో రూ.60 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ షాదీఖానాను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర శాసనమడలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యతో శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారన్నారు. మైనార్టీలను రాజకీయంగా అభివృద్ధి చేయాలని అన్ని రకాల పదవులలో నియమిస్తున్నారన్నారు. ఎప్పుడు లేని విధంగా ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారన్నారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమం, అభివృద్ధికి 18 రకాల సంక్షేమ పథకాల ద్వారా, 35 రకాల అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పారదర్శకంగా లబ్ధి చేకూరుతుందన్నారు. నియోజకవర్గంలో దశబ్దాలుగా అభివృద్ధికి నోచుకొని రహదారులను విస్తరణ చేశారని, మద్రాసు కెనాల్ పై బ్రిడ్జ్ నిర్మాణ పనులు చేపట్టారని, తాగునీరు లేని గ్రామాలకు నీరు సరఫరా అయ్యేలా కృషి చేశారని ఎమ్మెల్యేను అభినందించారు. త్వరలోనే పొన్నూరు లో ఆటోనగర్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.1600 కోట్లు సాయం అందిందని, ఇందులో ముస్లిం మైనార్టీలకు రూ.85 కోట్లు లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మెంబరు సయ్యద్ సుభాని, వడ్లమూడి సర్పంచి మోరంపూడి అనితా రాణి, ఎంపీటీసీ షేక్ నిరీషా బేగం, ఉప సర్పంచి అహ్మద్, చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజద్ బాషా

బహుజన ఆత్మగౌరవ పితామహుడు రామస్వామి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర రజక జనసేవ సంఘం ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి నాయకర్ 144వ జయంతి వేడుకలు ఆదివారం బాలాజీనగర్‌లో నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి పోరాడారని, బహుజన చైతన్యం కోసం స్త్రీలు పురుషులు సమానంగా పెంచాలని చదువులు ఉన్నత చదువులు చదివించాలని బోధించారని అన్నారు. అన్ని విషయాల్లో స్త్రీలకు స్వేచ్ఛ ఉండాలని కోరుకున్నారని తెలిపారు. బహుజనులకు సహాయం చేసేందుకు ధనవంతులు డబ్బులు వ్యర్థం చేయకుండా వారు మరణించినాక గుర్తుండి పోవాలంటే విద్య, వైద్యరంగాలకు సాయం అలందించాలని, తద్వారా బహుజనులకు మేలు జరుగుతుందని ఆకాక్షించేవారని చెప్పారు. రాజ్యాంగంలో మొట్టమొదటిసారిగా సవరణ చేసి బీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి రామస్వామి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఎన్.రాంబాబు, వి.సాంబయ్య, సిహెచ్.వెంకటేశ్వరరావు, పి.శివరావు, పి.రమాదేవి పాల్గొన్నారు.



భీమ్ భారత్ కార్యాలయంలో పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

మనిషిని మనిషిగా గౌరవించని సమాజం, సమాజమే కాదని వెలిగెత్తి సాటిన గొప్ప సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి ఆలోచనలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని బీమ్ భారత్ కార్యాలయంలో పెరియార్ రామస్వామి నాయకర్ 143 జయంతి నిర్వహించారు. సంఘం నాయకులు అంకం శ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిన గొప్ప ఆదర్శమూర్తి పెరియార్ అని అన్నారు. కార్యక్రమంలో ముస్లిమ్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు ఎస్.కె.ఖాజావలి, న్యాయబ్రాహ్మణ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోరబల్లి బాబురావు పాల్గొని పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కొనసాగిన టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా విలేకర్లు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ స్థానిక జెకెసికళాశాల రోడ్డులో ఆదివారం టిడిపి నాయకులు, ప్రైవేటు కళాశాల అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర(నానీ) ఆధ్వర్యంలో 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్(బుజ్జి), డివిజన్ అధ్యక్షులు లంకా ఉదయ్ దీక్షలకు ఏర్పాట్లు చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్,పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు సంఘీభావం తెలిపారు. మార్కెట్ సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. వినుకొండలో నిరసన ప్రనదర్శన చేశారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు భార్య, శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి మాట్లాడారు. మంగళగిరిలో గౌతమ్ బుద్ధ రోడ్ లోని వైష్ణవి కళ్యాణమండపం పక్కన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి ఐదో రోజు చేరాయి. తుళ్లూరులో రాజధాని రైతులు, రైతు కూలీలు,మహిళలు సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు. పిడుగురాళ్లలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మేము సైతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముప్పాళ్లలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. పెదకూరపాడులో మహిళలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు.

పేదల ఇళ్ల జోలికొస్తే ఊరుకోం : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

ఆనాటి నుండి ఒక్కో ఇంటి నిర్మాణానికి తమ కష్టార్జితం అంతా దారపోసి రూ.లక్ష నుంచి ఐదు లక్షల రూపాయలు వెచ్చించి పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉపాధి దొరుకుతున్న ఇక్కడ నుంచి పేదలను ఖాళీ చేయించడం చట్టవిరుద్ధమన్నారు. నోటీసు అందుకున్న దగ్గర నుంచి ఏడు రోజుల్లో ఖాళీ చేయమనడం మరింత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఆర్ చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్న స్థలాలు పేదలకు అవసరమైతే వేరే చోట స్థలాలు చూపించి పేదలకు ఇళ్లు కట్టించిన తరువాతనే ఇళ్లు ఖాళీ చేయించాలని చట్టంలో స్పష్టంగా ఉందని చెప్పారు. కొంతమంది పేదలు నోటీసులు తీసుకోకపోతే నోటీసులు ఇళ్లకు అంటించి వెళ్లారని, ఇది సరైనది కాదని అన్నారు. ప్రజలను భయాందోళనలకు గురి చేసే విధంగా అధికారులు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంతాల్లో గతంలో పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారని చెప్పారు. అధికారులు తమ తీరు మార్చుకోకపోతే పేదలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఎక్కడున్న వారికి అక్కడే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు భిన్నంగా పేదల ఇళ్లను ఖాళీ చేయిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తాము ఇక్కడే ఉంటామని, ఇక్కడ నుంచి కదిలే ప్రసక్తేలేదని సిపిఎం నాయకుల ముందు స్పష్టం చేశారు. ఎక్కడో స్థలాలు ఇస్తామని ప్రభుత్వం చెబితే ఆశపడి వెళ్లామని, తీరా అక్కడకు వెళ్తే కోర్టు వివాదాల వల్ల స్థలాలు రావని తేలిపోయిందని నాయకుల ముందు వాపోయారు. మంగళవారం సచివాలయం ముందు నిరసన ధర్నా చేయడానికి సంసిద్ధంగా ఉన్నామని చెప్పారు. అనంతరం తాడేపల్లి సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడ నివాసం ఉంటున్న పేదలను అక్కడే ఉంచి, ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. లేకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.కరుణాకరరావు, ఎస్.ముత్యాలరావు, డివి భాస్కరరెడ్డి, ఎల్.ఆచారి, బి.గోపాల్‌రెడ్డి, డి.యోహాన్, కె.వెంకటయ్య, బి.సుబ్బారావు, ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అధికారులు అంటించిన నోటీసులను పరిశీలిస్తున్న పాశం రామారావు, బి.వెంకటేశ్వర్లు


పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి డి.వి.ఎస్.ఎస్ సోమయాజులు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్



న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న కేసులను పరిష్కరించటానికి న్యాయమూర్తులు మరింత కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్ సోమయాజులు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా కోర్టులో జిల్లాలోని న్యాయమూర్తుల పనితీరును ఆయన సమీక్షించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారధి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఏడాది జనవరి నుండి జూన్ వరకూ న్యాయస్థానాల్లో న్యాయమూర్తులు నిర్వహించిన పనితీరును ఆయన సమీక్షించారు. పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు జిల్లాలోని న్యాయమూర్తులు న్యాయవాదుల సహకారంతో కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవల జిల్లా జడ్జీలుగా ప్రమోషన్ పొందిన జి.చంద్రమౌళేశ్వరి, బి.సాదుబాబులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సోమయాజులును సత్కరించి, జ్ఞాపిక బహుకరించారు. అనంతరం జిల్లా న్యాయశాఖ సిబ్బంది అధ్యక్షులు పాపిరెడ్డి, పాలపర్తి శ్రీనివాసరావుతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఆయనను కలిసి సమస్యలను వివరించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కామ్రేడ్ కొల్లా వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కొల్లిపర వెంకటేశ్వరరావు

మహోన్నత వ్యక్తి కొల్లా వెంకయ్య

వర్ధంతి సభలో నాయకులు - ఘన నివాళులు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

నిరాడంబరుడు, మానవతావాది, భూ సంస్కరణల అమలుకు విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి కొల్లా వెంకయ్య అని సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి కొల్లిపర వెంకటేశ్వరరావు అన్నారు. కొల్లా వెంకయ్య 25వ వర్ధంతిని మండల కేంద్రమైన పెదనందిపాడులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కొల్లిపర వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించగా జెండాను ఖాదర్‌వలి ఆవిష్కరించారు. అనంతరం కొల్లా రామన్ అధ్యక్షతన శివాలయం మండపంలో ఏర్పాటు చేసిన సభలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. నల్లమడ వాగు అభివృద్ధికి కొల్లా వెంకయ్య విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కార్యదర్శి యార్లగడ్డ అంకమ్మ చౌదరి, వెంకయ్య కుటుంబీకులు డాక్టర్ కొల్లారాజమోహన్, డాక్టర్ కొల్లా అమర్, ఇతర నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా వెంకయ్య విగ్రహానికి సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, నాయకులు జె.రామారావు, కె.శివనాగేశ్వరావు, కె.నాగేశ్వరరావు, కె.వెంకటశివరావు, ఎం. వెంకటేశ్వర్లు, సిహెచ్. యానాదులు, ఎం.రమణ, కె.శ్రీనివాసరావు, పి.శేషగిరిరావు, కె.వెంకట సుబ్బారావు, గుంటూరు ఛానల్ సమితి నాయకులు ఎన్.ఆచార్యులు, కె.హరిబాబు, ఎల్.వెంకట నాగేశ్వరరావు తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు.

రూ.7.50 లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్



ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే మదర్ థెరిస్సా సూక్తులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి వ్యక్తి ఇతరులకు సాయంపడాలని ఎపి సిపిడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారత రావు అన్నారు. ఆదివారం స్థానిక సాయి అన్న పూర్ణాలయంలో పెదనందిపాడు ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జయభారత్‌రావు మాట్లాడుతూ కష్టపడి బాధ్యతలును నిర్వహించినప్పుడే శాసించే స్థాయికి ఎదుగుతారు అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చారిటబుల్ సెక్రటరీ అరవపల్లి కృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది 125 మంది విద్యార్థులకు రూ.7.50 లక్షలు అందించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు దాసరి శేషగిరిరావు, దాతలు విద్యుత్ శాఖ విశ్రాంత డిఇ ఎం.కృష్ణ, జి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

'చెంచాలే నేతలైతే' అంశంపై 24న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పుస్తకావిష్కరణ పోస్టర్ విడుదల చేస్తున్న మల్లిఖార్జునరావు తదితరులు

బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "చెంచాలే నేతలైతే' అనే అంశంపై ఈనెల 24వ తేదీన విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తామని బ్లూ వింగ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు పులి మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను ఆదివారం గుంటూరులోని అంబేద్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కృషిని స్వార్ధ నాయకులు హరించివేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీల రాజకీయ స్వేచ్ఛను పట్టపగలే దొంగలిస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీల్లో వెన్నెముక లేని వారే రాజకీయ నేతలుగా ఎన్నిక అవుతున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారమే ధ్యేయంగా సమాజంలో అత్యున్నత స్థాయి రాజ్యాధికారాన్ని సాధించేందుకు అవసరమైన అన్ని రకాల అంశాలపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సుకు ముఖ్య వక్తలుగా ప్రముఖ పత్రిక సంపాదకులు సతీష్ చంద్ర, విజయవాడ సిటీ డిసిపి మొక్క సతీష్‌బాబు, ప్రముఖ గాయకులు సుక్క రామనరసయ్య, వెల్లూరులోని విట్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ టి.వేణుగోపాల్, దళిత్ హిస్టోరియన్ బి.రామారావు, ఎపి ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ యు.వినయ్ కుమార్ ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ సిహెచ్ శివరామకృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సిహెచ్.రాజేష్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులకు పాతర

రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో నాలుగేళ్లుగా తీవ్రమైన నిర్బంధకాండ కొన సాగుతుందని, పౌరులకు ప్రజాస్వాం కల్పించిన హక్కులను అణిచేస్తున్నారని వివిధ పార్టీల నాయకులు అన్నారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల పైనే కాకుండా ప్రజలపై నిర్బంధానికి ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, టిడిపి జిల్లా నాయకులు శివరామయ్య, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ జనసేన నగర అధ్యక్షులు ఎన్.సురేష్, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.జగన్మోహన్‌రెడ్డి ప్రసంగించారు. రాష్ట్రంలో చరిత్రలో ఎన్నడూ లేనంతగా పోలీసు రాజ్యం నడుస్తోందని, చట్టబద్ధంగా ప్రతిపక్షాలు, సంఘాలు తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేయాలన్నా అవకాశం లేదని ముప్పాళ్ల అన్నారు. ప్రజాసమస్యలు చెప్పుకోవటానికి సిఎం ఏ ఒక్క పార్టీకి కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శివరామయ్య మాట్లాడుతూ వైసిపి పాలనలో అవినీతి పరాకాష్టకు చేరిందని, ప్రభుత్వ అరాచక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని నిర్బంధాలకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నళినీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ బాటలోనే జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షాలను, ప్రజాస్వామ్యాన్ని కాలరాయాలని చూస్తున్నారని విమర్శించారు. సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ అత్యంత దారుణమని, తాను 16 నెలలు జైలు జీవితం గడిపానని, ప్రతిపక్ష నాయకుల్ని జైలుకు పంపాలనే కక్షతోనే చంద్రబాబును అరెస్ట్ చేయించారన్నారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు కె.రంగారెడ్డి, షేక్ వలి, డి.వెంకటరత్నం, సిపిఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి పాల్గొన్నారు.



తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని ధరణికోటకు చెందిన దాములూరు వెంకటశివరావు అనే వ్యక్తి తెలంగాణ మద్యం ను అక్రమంగా రవాణా చేస్తూ సత్య మహర్షి పవర్ ప్లాంట్ ముత్తాయపాలెం సమీపంలో ఎస్పి పల్నాడు స్పెషల్ టీంకు పట్టు పడ్డారు. వారిని పెద కూరపాడు ఎస్సీబీ స్టేషన్ కు ఎస్పీ టీమ్ అప్పజెప్పినట్లు ఎస్సై ఫణి కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 140 ఫుల్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని అనానరు. కేసు నమోదు చేశామని సోమ వారం రిమాండ్ కు తరలిస్తామని తెలిపారు.



మహిళా బిల్లు ప్రవేశ పెట్టాలి

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షులు కాండ్రు కమల కోరారు. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మహిళ లకు రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. 25 ఏళ్లుగా పార్లమెంట్లో మహిళా బిల్లు ప్రవేశపెడుతున్నా రాజకీయ పార్టీలు ఆమోదించడం లేదని విమర్శించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహేష్, జిల్లా కో-ఆర్డినేటర్ కె.స్వాతి, నాయకులు టి.కిరణ్, ఎ.బాలాజీ పాల్గొన్నారు.



322 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మండలంలోని చింతలపూడిలో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి ట్రస్ట్ సంయుక్తంగా ఆదివారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డివిసి హాస్పిటల్ - రీసెర్చ్ సెంటర్ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, డాక్టర్ మన్మిత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 322 మంది వైద్య పరీక్షలు చేయగా 207 మందిని శుక్లాల ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. వీరికి ఈ నెల 18, 20 వ తేదీలలో ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్.శ్రీనివాసరావు, మేఘన, నాగబాబు పాల్గొన్నారు.



వావిలాల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వావిలాల జీవితం యువతకు ఆదర్శనీయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

పద్మభూషణ్ అవార్డు గ్రహీత, స్వాతంత్ర్య సమర యోధులు , మాజీ శాసనసభ్యులు వావిలాల గోపాలకృష్ణయ్య నిరాడంబర జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానికంగా నిర్వహించిన వావిలాల 118వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ వావిలాల జీవన విధానం నేటి రాజకీయ నాయ కులకు ఆదర్శనీయం అన్నారు . అనంతరం వావిలాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వావిలాల మనవడు సోడేకర్ ఆధ్వ ర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్య క్రమంలో మాజీ శాసన సభ్యులు వై.వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చియర్డు చైర్మన్ ఎన్ రాజ నారాయణ, స్థానిక యార్డు చైర్మన్ పి.బాబు రావు, ప్రజ్వలన సంస్థ నిర్వాహకులు బి.పూర్ణచంద్రరావు, కమిషనర్ కె. షమ్మి పాల్గొన్నారు .

వావిలాల ఘాట్ వద్ద..



నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత వావిలాల గోపాల కృష్ణయ్య అని డాక్టర్ జి. శ్రీధర్ అన్నారు. వావిలాల గోపాలకష్ణయ్య 118 వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన వావిలాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం బ్రాహ్మణ ఐక్య వేదిక సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు శ్రీ పెద్దింటి ఫణికృష్ణ, మంచికంటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకులు కొనంకి మారుతి, ఆదిశైవసంఘ రాష్ట్ర నాయకులు, బెల్లంకొండ నరసింహారావు, కొండ కావూరి మార్కండేయ శర్మ అర్చక సంఘం నాయకులు తూమాటి మురళి విఖనస మండలి అధ్యక్షులు డాక్టర్ వేదాంతం రామకృష్ణమాచార్యులు, సంఘ సభ్యులు ఆర్కే మూర్తి(గోల్డ్) సంగాపు కామేశ్వర శర్మ మేడికొండూరు రాజశేఖర్ గుండ వరపు అమర్ నాథ్ పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో రిలయన్స్ ట్రెండ్స్ స్టోర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక నర్సరావుపేట సెంటర్‌లో రిలయన్స్‌ట్రెండ్స్ స్టోర్ ప్రారంభించారు. ఆకర్షణీయమైన దుస్తులతో ఈ స్టోర్ పట్టణ ప్రజలను ఆకర్షిస్తుందని కంపెనీ ప్రతినిధి తెలిపారు. వినియోగదారుల అభిరుచికి తగినట్లుగా అందుబాటు ధరల్లో, చెల్లించిన ధరకు అత్యధిక విలువ కలిగిన వస్త్రశ్రేణి అందు బాటులో ఉంటుందన్నారు. ఆధునిక ఉమెన్స్‌వేర్, మెన్స్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక, గొప్ప షాపింగ్ అనుభవం కలుగుతుందన్నారు. స్టోర్ ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ఆఫర్ కింద రూ.3999లు షాపింగ్‌పై రూ.249కి ఆకర్షణీయమైన బహుమతి ఉంటుందన్నారు. అలాగే, రూ.3999 కొనుగోలుపై రూ.2వేల విలువైన కూపున్లు పూర్తి ఉచితంగా పొందవచ్చన్నారు. కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బిందు, తుంపర సేద్యం విధానంలో

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు

- వంద శాతం తక్కువ స్థాయికి ఎరువుల వినియోగం
- తక్కువ పెట్టుబడి అధిక, నాణ్యమైన దిగుబడి
- రైతులకు అధిక ఆదాయం చేకూర్చడమే లక్ష్యం
- గతేడాది 375 ఎకరాల్లో.. ఈ ఏడాది 4 వేల ఎకరాల్లో ..
- సూక్ష్మ నీటి పారుదల జిల్లా అధికారి చలంచర్ల ఆంజనేయులు



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బిందు, తుంపర్ల సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయొచ్చని సూక్ష్మ నీటి పారుదల జిల్లా అధికారి చలంచర్ల ఆంజనేయులు అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ 90 శాతం నీటి ఆదా, మొక్కలకు అందించే ఎరువులు వృధా కాకుండా 100 శాతం ఎరువుల వినియోగం,వ్యవసాయ ఖర్చులు తగ్గి రైతులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు.

బిందు సేద్య విధానం పై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించే విధంగా రైతు భరోసా కేంద్రాలలో కరపత్రాలు, దినపత్రికల ద్వారా కూడా చర్యలు తీసు కుంటామని చెప్పారు. తక్కువ నీరు తక్కువ పెట్టుబడితో సాగయ్యే బిందు సేద్య విధానాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీలు అందజస్తుందని, జిల్లాలో బిందు సేద్యానికి ఆదరణ బాగానే ఉందని అన్నారు. బిందు, తుంపర సేద్యం ద్వారా సాగు చేసు కునేందుకు రైతులు ముందుకు వస్తున్నారని, అలా వచ్చేవారికి ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగునీటి పథకం ద్వారా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం నుండి వచ్చే సహాయ సహకారాలు అందిస్తామని , దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో మైక్రో ఇరిగేషన్ పనితీరు గురించి ఆయన ప్రస్తావిస్తూ మంచి ఆదరణ ఉందని, బిందు ,తుంపర్ల సేద్యంపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

అందుబాటులో ఉన్న తక్కువ నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించు కొని, అధిక విస్తీర్ణంలో భూమిని సాగులోకి తెచ్చేందుకు నాణ్యమైన దిగుబడుల సాధన, రైతుల ఆదాయం పెం చడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పని చేసేందుకు సచి వాలయ, వ్యవసాయ శాఖ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది సహాయ సహకారాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నూతన పల్నాడు జిల్లాలో ప్రణాళికల విషయం గురించి ఆంజ నేయులు ప్రస్తావిస్తూ ఈ పథకం కింద రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది 150 హెక్టార్లలో ఈ విధానంలో పం టలు సాగు చేపట్టామని, ఈ ఏడాది 2,500 హెక్టార్లలో సాగు అమలుకు లక్ష్యంగా పెట్టుకు న్నామని, ఇప్పటికి 1600 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం విధానంలో సాగు చేపట్టినట్లు వివరించారు. బిందు, తుంపర సేద్యం విధానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న రాయితీలు గురించి ఆయన ప్రస్తావించారు. ఈ ఏడాది బిందు సేద్యం డ్రిప్ పరికరాలను 2 హెక్టార్ల కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీతో, 2 హెక్టార్ల నుండి 4 హెక్టార్ల లోపు భూమి కలిగిన రైతులకు 70 శాతం రాయితీని , తుంపర్ల సేద్యం పరికరాలు 2 హెక్టార్ల కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు 55 శాతం, 2 నుండి 4 హెక్టార్ల లోపు భూమి ఉన్న రైతులకు 45 శాతం రాయి తీలను ఈ పథకం అమలుకు ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు ఎటువంటి ప్రత్యేక రాయితీలు లేవని, ఒకటే రాయితీ విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు చెప్పారు.

కౌలు రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు అవసరమైతే భూ యజమాని కౌలు ఒప్పందం పత్రం, భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు ఉండాలని, జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే ఏడాది మార్చి 31 వరకు దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. ప్రతిపాదిత లక్ష్యం నిర్ణయించామని, మండలాలు వారిగా నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించామని అన్నారు. బిందు, తుంపర సేద్యం పరికరాల కోసం వారి వివరాలను సమీప రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఇప్పటివరకు 1600 హెక్టార్లకు రిజి స్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు.

ప్రభుత్వ రాయి తీలు పోను మిగిలిన డబ్బులు రైతులు చెల్లించిన తర్వాత వారికి కావాల్సిన పరికరాలు అందజేస్తామని అన్నారు. ఈ పథకం జిల్లాలో రైతులకు అందజేసిన ప్రతి చోటా సమర్థ వంతంగా అమలు జరుగుతోందని చెప్పారు. ప్రధానంగా భూగర్భజలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలు వినుకొండ, బొల్లాపల్లి, నూజెండ్ల,మాచర్ల, చిలకలూరి పేటతో పాటు వాణిజ్య పంటలు సాగుచేస్తున్న నకరికల్లు, పెదకూరపాడు, సత్తెనపల్లి,నరసరావుపేట, రొంపిచర్ల తదితర ప్రాంతాలలో ఈ పథకం పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు.

బిందు, తుంపర సేద్యంలో ఆ పంట, ఈ పంట అనే తారతమ్యం లేకుండా బోరు లేదా బావి వంటి నీటి వనరులు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఉంటే దరఖాస్తు చేసుకున్న తర్వాత ఇంజనీర్ పర్యవేక్షించిన తర్వాత అయిన ఖర్చుకు రాయితి పోను మిగిలిన సొమ్ము రైతు చెల్లించిన 15 నుండి 20 రోజులలోపు పరికరాలు అందజేస్తా మన్నారు. ముఖ్యంగా పండ్ల తోటలు అరటి, బొప్పాయి, జామ, కూరగాయలు, మిర్చి, ప్రత్తి, పట్టు పరిశ్రమ, సుగంధ ద్రవ్యాల వంటి వాణిజ్య పంటలకు, బిందు సేద్యం పరికరాలు, అదేవిధంగా నూనె విత్తనాలు మొక్కజొన్న, శనగ, వేరుశనగ, మినుము, పెసర,అలసంద వంటి పంటలకు తుంపర్ల సేద్యం పరికరాలు రాయితీపై ఇస్తామని అన్నారు. బిందు సేద్యం విధానం ద్వారా నీరు వృధా కాకుండా నేరుగా మొక్క వేరు వ్యవస్థకు నీరు సం ఫరా అవుతుందని సాల్లలో నీరు సరఫరా కాకపోవడంతో కలుపు ఉద్ధృతి, చీడ పీడల ఉధ్రుతి తక్కువగా ఉంటుందని అన్నారు. రసాయనిక ఎరువులు అందించే సమయంలో గొట్టం ద్వారా వేరు వ్యవస్థ వద్దకు ఎరువు అందించాల్సి ఉన్న నేపథ్యంలో ఎరువుల వృధా కాకుండా అరికట్టేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా, అపరాల సాగులో నిర్ణీత మోతాదులో నీరు మొక్కకు అందించడ మనేది తుంపర్ల సేద్యం విధానంలో మాత్రమే సాధ్యం అవుతుందని అన్నారు. సాధారణ విధానంలో పండించిన, బిందు,తుంపర్ల సేద్యం విధానంలో రైతులు సాగు చేసిన పొలాలను పరిశీలించిన క్రమంలో అధిక,నాణ్యమైన దిగుబడి రావడం గమనించినట్లు చెప్పారు.

ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించడం గురించి వివరిస్తూ, గ్రామ సచివాలయంలో రైతు భరోసా కేంద్రాల వద్ద, గ్రామ ఉద్యాన శాఖ,వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా ఐదుగురు ఏరియా అధి కారులు గ్రామ, మండలాల వారీగా రైతులకు ఈ పథకం గురించి వివరిస్తారని చెప్పారు. దీంతోపాటు, వైఎస్సార్ తోటబడి ద్వారా రైతులకు అవగాహన సదస్సులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో నమూనా స్టాల్స్ ఏర్పాటు, కరపత్రాల పంపిణీ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

తీసుకున్న పరికరాలు మరమ్మతులకు గురై ఒక సారి లబ్ది పొందిన రైతుకు మళ్ళీ పరికరాలు కావాల్సి వస్తే కనుక ఆ రైతు ఏడేళ్లు ఆగాలని, మళ్లీ రాయితీపై పరికరాలు పొందేందుకు అర్హత లభిస్తుందని చెప్పారు. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా చేయడం ద్వారా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడడమే కాకుండా రైతులకు కొనుగోలు శక్తి పెరుగుతుందని అన్నారు. రైతుల్లో కొనుగోలు శక్తి పెరిగితే అన్ని వ్యాపార వర్గాలు, సంస్థలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా గ్రామం,పట్టణం, రాష్ట్రం,దేశం అభివృద్ధి చెందుతుందాని అన్నారు. రైతులు నూతన సాంకేతిక విధానాలను అవలంబించేలా అవగాహన కల్పించి వ్యవసాయ రంగాన్ని లాభ సాటి చేయడమే తమ లక్ష్యమని చెప్పారు.

ప్రమాదాలకు నెలవుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నిషేధించిన ఇనుప విద్యుత్ స్తంభాలను ఇంకా తొలగించని వైనం!

ప్రజాశక్తి -కారంపూడి

పట్టణంలోని ఎస్సీ కాలనీలో సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇది అతి తక్కువ ఎత్తులో ఉండటం వలన ప్రమాదాలు జరిగి ప్రాణాలే కోల్పోయే పరిస్థితి నెల కొంది. కాల నీలో నడి మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండ టం, చెయ్యి పైకెత్తితే తగిలే ఎత్తులో అది ఉండటంతో ఆ ప్రాం తంలో తిరిగే చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు ప్రమా దం బారిన పడతామనే భయాందోళనలు వ్యక్తం చేస్తు న్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుండి తొలగిస్తారా లేక, దాని ఎత్తు పెంచడమో చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోయే వరకూ ఆగకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అంతేకాకుండా నిషేధించిన ఇనుప విద్యుత్ స్తంభాలు పట్టణంలో అక్కడక్కడ ఉండటంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీటిని తొలగించి వాటి స్థానంలో సిమెంట్ విద్యుత్ స్తంభాల వేయాలని, ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు.



ఎస్సీ కాలనీలో సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పల్నాడు జిల్లా ఆరోగ్యమిత్రల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - వినుకొండ



శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు

నరసరావుపేటలోని కొండవీడు ఈఎన్‌టి హాస్పటల్ లో పల్నాడు జిల్లా ఆరోగ్యమిత్రల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లా కమిటీలో వినుకొండ పట్టణంలోని ఆరోగ్య మిత్రలుగా పనిచేస్తున్న వారికి అవకాశం ఇచ్చారు. ఎన్నికైన వారిలో విను కొండలోని మాధవ హాస్పిటల్ లో ఆరోగ్య మిత్రగా పనిచేస్తున్న బొమ్మలవరకు శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. వినుకొండలోని గవర్న మెంట్ హాస్పిటల్లో పనిచేస్తున్న సింగంశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సంద´ర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఆరోగ్య ఆరోగ్య మిత్రాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. నూన అధ్యక్షకార్యదర్శుల ఎన్నికపై ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన ఆరోగ్యమిత్రాల ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి, రాష్ట్ర కార్యదర్శి కాకాని అప్పారావు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రాప్యారిస్‌ను పట్టి పీడిస్తున్న ట్రాఫిక్

- ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు శూన్యం
- విధుల్లో ఎస్ఐతో పాటు 10 మంది సిబ్బంది మాత్రమే
- రోజురోజుకూ జటిలమవుతున్న సమస్య

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. పెరుగుతోన్న జనాభా, వాహనాల వినియోగానికి అనుగుణంగా రోడ్లు లేవు. ఉన్న రోడ్లలో వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణలేదు. దీనికి తోడు ప్రత్యేకంగా ట్రాఫిక్ విభాగం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవటంలేదు. కేవలం ట్రాఫిక్ నియంత్రణకు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను కేటాయించి, నామమాత్రపు సిబ్బందితో మమ అనిపిస్తున్నారు. దీంతో పరిష్కారం లేని సమస్యగా ట్రాఫిక్ సమస్య తయారైంది.

సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీల్లో తెనాలి ఒకటి. దాదాపు నూరేళ్లకు పైగా చరిత్ర కలిగిన తెనాలి పురపాలక సంఘంలో 40 వార్డులున్నాయి. నలుదిశలా విస్తరిస్తున్న పట్టణంలో జనాభా కూడా రోజురోజుకూ పెరుగుతోంది. రెండు లక్షల పైచిలుకు జనాభా కలిగిన తెనాలిలో కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల వినియోగం ఎక్కువే. దీనికి తోడు వివిధ సంస్థలకు చెందిన రవాణా వాహనాలు కూడా అధికమే. అయితే పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్లు లేవు. అధిక శాతం వ్యాపార కూడళ్లకు పార్కింగ్ స్థలం కూడా లేదు. కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లకు కూడా సెల్లార్లు లేకుండా నిర్మిస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. దీంతో పట్టణంలో ఏ ప్రాంతంలో చూసినా వాహనాల పార్కింగ్ రోడ్లపైనే. ప్రధానమైన రోడ్లలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపి ఉంచటంతో పెద్ద పెద్ద రోడ్లు సైతం ఇరుకు సందులను తలపిస్తున్నాయి. పట్టణంలో ప్రతి నిత్యం ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ముఖ్యంగా కొత్తవంతెన, ఎన్వీఆర్ బ్రిడ్జి సాయిబాబా గుడి, లక్ష్మీడీలక్స్ కూడలి, శివాజిచౌక్, గాంధీచౌక్, అశోక పెన్‌వర్క్స్ ప్రాంతాల్లో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ట్రాఫిక్ జామ్ కావటం ఖాయం.

ట్రాఫిక్ విభాగం ఏర్పాటే లేదు

నియంత్రణా సిబ్బంది నామమాత్రమే

గుంటూరు తరువాత జిల్లాల్లో అతి పెద్ద పట్టణం తెనాలి. పట్టణంలో ట్రాఫిక్ తీవ్రత, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు దీర్ఘకాలికంగా చూస్తూనే ఉన్నారు. ట్రాఫక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటుకు మాత్రం చర్యలు తీసుకోలేదు. కేవలం ట్రాఫిక్ నియంత్రణకు సబ్ ఇన్‌స్పెక్టర్‌ను కేటాయించి, మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఓ గదిని కేటాయిచి మిన్నకున్నారు. తెనాలి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు కనీసం 25 మంది సిబ్బంది ఉండాలని అధికారులే చెబుతున్నారు. అయితే సబ్ ఇన్‌స్పెక్టర్‌కు తోడు పట్టణంలోని ఒన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల నుంచి ఇద్దరు చొప్పున కానిస్టేబుల్స్‌ను ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగిస్తున్నారు. వారితో పాటు హోంగార్డులు కూడా. అంతా కలిసి పది మందిలోపే సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో ఉంటున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణ వారికి పెద్ద సవాలుగానే ఉంది.



వహాబ్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌తో నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ స్టేషన్ ఎస్టాబ్లిష్‌మెంటే లేదు..

పైగా సిబ్బంది కొరత



పట్టణంలో రజకచెరువు, ఎన్‌విఆర్ బ్రిడ్జి, అశోక పెన్‌వర్క్స్, శివాజి చౌక్, గాంధీ చౌక్ ట్రాఫిక్ పాయింట్లుగా ఉన్నాయి. వాస్తవానికి తెనాలిలో ట్రాఫిక్ విభాగం ఏర్పాటే లేదు. కేవలం ట్రాఫక్ క్రమబద్ధీకరణకు నాతో పాటు మొత్తంగా పది మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నాం. వాస్తవానికి కనీసం 25 మంది సిబ్బంది ఉండాలి. ఇటీవల నేను బాధ్యతలు స్వీకరించిన తరువాత మార్కెట్ వంతెనపై వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆటోల పార్కింగ్ క్రమబద్ధీకరించాం. ఆదివారం ఇష్టానుసారంగా రోడ్లపై నిర్వహించే ఫిష్ మార్కెట్‌ను బస్టాండ్ నుంచి నందివెలుగు రోడ్డు మార్జిన్‌కు తరలించాం. ఇలా చిన్నిచిన్న మార్పులకు ప్రయత్నిస్తున్నాం. అవకాశం ఉన్నమేర ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నాం.

బి.శివరామయ్య, ట్రాఫిక్ ఎస్ఐ, తెనాలి.



పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ దృష్టిలో పెట్టుకో వాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గుంటూరు రీజియన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.నారా యణన్ అన్నారు. ఆదివారం స్థానిక గాంధీ పార్కు వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడుని పూజించాలని, రసాయనాలతో తయారు చేసిన ప్రతిమలు వాడవద్దని కోరారు. కార్యక్రమంలో ఎనలిస్ట్ వెంకటేశ్వరావు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

29న విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి-మంగళగిరి

వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 29వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాలో వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. 'దళితుల సమస్యలు - పరిష్కార మార్గాలు' అంశంపై స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి వై.కమలాకర్ అధ్యక్ష వహించారు. అప్పారావు మాట్లాడుతూ దళితుల పట్ల వివక్ష రోజుకు పెరిగిపోతోందని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకుందని విమర్శించారు. దళితులపై రాష్ట్రంలో దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదని విమర్శించారు. శ్మశాన స్థలాల్లేక దళితులు ఎన్నో ఏళు ్లగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.కోటేశ్వరి, సిఐటియు నాయకులు జెవి రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, టి.శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ, కెవిపిఎస్ నాయకురాలు ఇ.విజయలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఇ.కాటమరాజు, పి.అప్పారావు, సంజీవరావు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

మాయలపై మండిపడిన బోయి భీమన్న కవిత్వం

ప్రజాశక్తి - గుంటూరు : మాయలపై మండిపడిన కవిత్వం బోయి భీమన్న రాశారని ప్రముఖ సినీ రచయిత, విమర్శకులు యర్రగుంట్ల పాణిరావు అన్నారు. స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీమిత్రులు ఆదివారం నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో బోయిభీమన్న కవిత్వంపై పాణిరావు మాట్లాడారు. సమాజంలోని అసమానతలపై భీమన్న కలం ఝుళిపించారని, మానవత్వం ప్రధాన భూమికగా కవితలు రాశారని చెప్పారు. 'గుడిసెలు కాలిపోతున్నాయి' కవితా సంపుటిలో కవిత్వం ప్రజలలో చైతన్యం పెంచి ప్రగతి మార్గంలో పయనించేలా దోహదం చేస్తుందన్నారు. 'పాలేరు' నాటకం పాత్ర పోషణ, సందేశం చాల గొప్పగా ఉంటుందని, జాషువా గబ్బిలం పాత్ర తీసుకున్నట్లు బోయి భీమన్న పిల్లి పాత్రను ఆదర్శనీయంగా చిత్రించారని, వ్యంగ్యం అయన కవిత్వానికి ప్రాణమని వివరించారు. సినీ రచయిత, బుల్లి తెర నటులు బత్తిన అగస్తీశ్వరరావు రాసిన 'అతిలోక వీరుడు-జగదేకసుందరి 2' సినీ నవలను సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ రావి రంగారావు ఆవిష్కరించారు. సాహితీవేత్త డాక్టర్ మైలవరపు లలితకుమారి నవలను సమీక్షిస్తూ నవలను సినిమాగా తీస్తే అత్యంత జనాదరణ పొంది తీరుతుందని తెలిపారు. 'ఈ మాసం కవి'గా చందలూరి నారాయణరావు (అద్దంకి) తాను రాసిన అనేక కవితలను వినిపించారు. సంస్థ కన్వీనరు పింగళి భాగ్యలక్ష్మి చందలూరి రాసిన 'మనిషి గుర్తుల్ని బతికించుకుందాం' కవితల సంపుటిని సమీక్షించారు. బలభద్రపాత్రుని ఉదయశంకర్ 'కథానిక తీరుతెన్నులు' గురించి మాట్లాడారు. భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠనం కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్ పట్నాయక్

'ఎవరు గెలిచినా ఫాసిజం తప్పదు'

ప్రజాశక్తి-గుంటూరు : ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం గుంటూరు జిల్లా, రాష్ట్ర మహాసభలు ఆదివారం స్థానిక గొట్టిపాటి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాసిజం-రాజకీయ, ఆర్థిక, సాంస్కృతి అంశాలు అనే అంశంపై జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు రమేష్ పట్నాయక్ ప్రసంగించారు. ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారా విప్లవం రాదని, కానీ ఫాసిజం వస్తుందన్నారు. విప్లవాన్ని అణచివేసే ముందస్తు చర్య ఫాసిజమని వివరించారు. పెట్టుబడిదారీ పాలనలో సంక్షేమ పథకాలతోనూ విప్లవాలకు అడ్డుకట్ట వేస్తారన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ధర్మాల రూపంలోని చట్టాలు ఫాసిజాన్ని అమలు చేసే చర్యలు, నియంతృత్వం, మతోన్మాదం కలిసిన పాలనే ఫాసిజం అన్నారు. 2024 ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఫాసిజం కొనసాగింపు తప్పదని అన్నారు. హనుమంతరెడ్డి మాట్లాడుతూ అప్రకటిత అత్యవసర పరిస్థితి లాగా భారత్ అప్రకటిత హిందూదేశం అయ్యిందన్నారు. రాజ్యాంగ, రాజ్యాంగేతర, ప్రజాస్వామ్య, విద్యా, వైద్యం, సాహిత్యం, సాంస్కృతిక, పరిశోధనా సంస్థలు అన్నీ సంఘ్ పరివారం అధికారుల ఆధీనంలో ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చదని, ఇండియా లాంటి పదాలను తొలగించటం, లౌకిక సామ్యవాద పదాలను తొలగించి, హిందూమతం, వైదిక శాస్త్రం లాంటి పదాలను రాజ్యాంగంలో చేరుస్తుందని చెప్పారు. రాజ్యాంగ లొసుగుల్ని వాడుకుంటుందన్నారు. అనంతరం వల్లూరు తాండవ కృష్ణ, పివి.మల్లిఖార్జునరావును ప్రోగ్రెసివ్ ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

నిరుద్యోగ యువతకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ వారి అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటి 2023-2024 నిర్వహించనున్న కార్యక్రమాలపై కలెక్టర్ లోతేటి శివ శంకర్ ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న నిరుద్యోగ యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు జాబ్ మేళ, స్కిల్ హబ్ ట్రైనింగ్స్, స్కిల్ కాలేజీ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కాలేజీలలో నిర్వహిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో మాట్లా డారు.



జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

నిరుద్యోగ యువతీయువకులకు మరిన్ని మెరుగైన శిక్షణ కార్యక్రమాలను, వారికి కావలసిన, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులపై శిక్షణ కార్య క్రమాలను ఏర్పాటు చేయాలని సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ఈ నెల 23న కోటప్పకొండ రోడ్డులోని నరస రావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ జాబ్ మేళాకు సంబంధించి సంస్థ ప్రచురించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్ప శ్రీ, డిఆర్డిఎ పిడి బి.బాలు నాయక్, పల్నాడు జిల్లా నైపు ణ్యాభివృద్ధి అధికారి కె. సంజీవరావు పాల్గొన్నారు.

ప్రజలకు పల్నాడు ఎస్పీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక పూజలు, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించు కోవాలని జిల్లా ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, అభి వృద్ధిలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఎమ్మెల్యే శంకరరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - క్రోసూరు


పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు ముందస్తు జన్మదిన వేడుకలు పెదకూరపాడు నియోజక వర్గంలో ఘనంగా నిర్వహించారు. క్రోసూరు మండల వైసిపి నాయకులు 57 కిలోల కేక్ తో వేడుకలు నిర్వ హించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే, అభి మానులు, కార్య కర్తల మధ్య భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్


ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు జలదంగి నర్సింగరావు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం నిరా హారం దీక్షలు చేపట్టారు. సత్తెనపల్లి తాలుకా సెంటర్లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ప్రతిపక్షాలు ఉదాశీనంగా వ్యవరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరాహారదీక్షల్లో కనుమూరి కోటేశ్వరరావు,జంగాల శ్రీను, కందుల జార్జి పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్త-బెల్లంకొండ

మండలం ఆర్యవైశ్య నూతన అధ్యక్షుడిగా ముప్పవరపు సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీ మద్దు ఆంజనేయులు వైస్ ప్రెసిడెంట్ గొడవర్తి హనుమంతరావు, ట్రెజరీ వెచ్చ అంకారావు యువజన అధ్యక్షుడిగా గొడవర్తి అయ్యప్ప వాసవి క్లబ్ అధ్యక్షుడిగా ముద్దు శ్రీనివాసరావు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా నాయకులు కట్టమూరి అప్పారావు నూతన కార్యవర్గంఓ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పోతుగంటి నరసింహారావు, ఆత్మకూరి వెంకట హరే రామ చంచయ్య, పాల్గొన్నారు.



విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేట కలెక్టర్ కార్యా లయంలోని స్పందన హాలులో విశ్వకర్మ జయంతి ఉత్స వాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్,ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాణాల ప్రకారం ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో, విశ్వకర్మను ఆహార ప్రదాతగా పేర్కొన్నారని అన్నారు.

రొంపిచర్లలో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆదివారం పారిశుధ్య పనులు జరిగాయి. ఈ నెల 15 నుండి వచ్చే నెల 15 వరకు పారిశుధ్య మాసోత్సవములలో భాగంగా గ్రామంలోని గోగులపాడురోడ్ లోని ఇళ్ళ ముందు ఉన్న సైడ్ కాల్వల్లో పూడిక తీశారు. ఆయా పనులను సర్పంచ్ కొమ్ము నాగేశ్వర రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామస్తులు తమ ఇళ్ల ముందున్న మురుగు కాల్వల్లో నీరు నిలవకుండా పారే విధంగా చేయాలని అన్నారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమలు పెరిగి మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశ ముందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచులు పడాల చక్రారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి పాల్గొన్నారు.





అనాథ వృద్ధురాలిని సత్తెనపల్లి సాధన వృద్ధుల ఆశ్రమానికి తీసుకెళ్తున్న కలాం చారిటబుల్ ట్రస్టు సభ్యులు

దీనస్థితిలో ఉన్న వృద్ధురాలికి సాయపడ్డ మహిళ

క్రోసూరు-ప్రజాశక్తి

ములుగురి ప్రత్యూష అనే మహిళకు మండలంలోని విప్పర్ల బస్టాండ్‌లో ఆదివారం దీనస్థితిలో ఉన్న అంగవైకల్యం కలిగిన ఓ వృద్ధురాలు కనిపించడంతో కలాం చారిటబుల్ ట్రస్ట్‌కు సమాచారమిచ్చి సాయపడింది. ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ ఖాసీం (బాబు) అక్కడికి వెళ్లి ఆమెను విచారించగా తనకు ఎవరూ లేరని ఆమె చెప్పడంతో ప్రథమ చికిత్స చేయించి సత్తెనపల్లిలోని సాధన అనాథ వృద్ధుల ఆశ్రమం ట్రస్ట్ చైర్మన్ సురేష్ తో మాట్లాడి అక్కడి చేర్పించారు. ఈ విషయాన్ని ప్రత్యూష తెలిపారు. కలాం చారిటబుల్ ట్రస్ట్ తరపున తమ వంతు సాధన అనాథ వృద్ధుల ఆశ్రమానికి రూ.5,000 ఆర్థిక సహాయం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యూషను కలాం చారిటబుల్ ట్రస్ట్ వారు అభినందించారు. అనాథ పిల్లలు,వృద్ధులు ఎవ రైనా కలాం చారిటబుల్ ట్రస్ట్ ను సంప్రదించాలని ట్రస్ట్ సభ్యులు కోరారు.

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని సత్తెనపల్లి పట్టణ ఎస్ఐ రఘుపతి విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి గుడి వద్ద ప్రజలకు 800 గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్ఐ హాజరయ్యారు. రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, అధ్యక్షులు మాతంగి సాంబశివరావు, ట్రెజరర్ వనమా నాగేశ్వరరావు, చందోలు మల్లిఖార్జున రావు, పాయసం మహేష్ బాబు, దాతలు కేరళ హెూటల్ సెల్వ, ఉపా ధ్యాయురాలు పద్మజ, సాయిరమేష్, మహబూ బ్ సుబాని, గోపి, తుమ్మల వెంకటేష్, మాతంగి రాహుల్ గౌతమ్ పాల్గొన్నారు.

జోరుగా వినాయక విగ్రహాల కొనుగోళ్లు

ప్రజాశక్తి-మాచర్ల

వినాయక చవితి సంర్భంగా వాడవాడల జరిగే వేడుకలకు రంగు రంగులతో ముస్తాబైన గణనాథులు తరలి వెళ్ళారు.మాచర్ల పట్టణంలోని విగ్రహాల తయారీ కేంద్రం నుండి వందల సంఖ్యలో విగ్రహాలను ఆదివారం కొనుగోలు చేశారు. మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం' అని జనవిజ్ఞారన వేదిక నాయకులు కేళం ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రైతులు వ్యాపారవేత్తలు అన్ని వర్గాల ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి నరసరావుపేట నియోజ కవర్గం బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆయా పార్టీల కార్యాలయాల నుండి వేర్వేరు ప్రకటనల్లో తెలి పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో 20 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల రూరల్ సర్కిల్ స్టేషన్ పరిదిలోని ఏ గ్రామంలోనైనా వినాయక మండపం ఏర్పాటు చేసుకోవాలంటే పోలీస్ అనుమతి తప్పనిసరి అని రూరల్ సిఐ షేక్. సమీముల్లా అన్నారు.స్దానిక సిఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతు, శాంతి భద్రతల దృష్ట్యా అనుమతులు తప్పనిసరి అని, తీసుకోని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినాయక చవితి ఎంతో గొప్ప పండుగ అని, దాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకందాం అన్నారు.నిబంధనల ప్రకారం మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

రైతు సమస్యలపై ధర్నాలు

- 20, 21 తేదీలలో రైతు భరోసా కేంద్రాల వద్ద, 25న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు
- జయప్రదానికి రైతు సంఘం పిలుపు




మంగళగిరి, పెదనందిపాడు సమావేశాల్లో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు, కె.అజయ్‌కుమార్

ప్రజాశక్తి - మంగళగిరి

అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల సమావేశం స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఎం.ఫకీరయ్య అధ్యక్షత వహించగా శివశంకరరావు మాట్లాడుతూ పంట దిగుబడులు తగ్గి, మద్దతు ధర దక్కక రైతులు అప్పుల పాలవుతున్నారని చెప్పారు. వీరిని ఆదుకునేందుకు రుణమాఫీ చట్టం చేయాలని, పంటల బీమా పథకాన్ని పాత పద్ధతిలో అమలు చేయాలని కోరారు, రాజధానికి భూమిలిచ్చిన రైతులకు వెంటనే కౌలు చెల్లించాలని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కొండవీటి వాగులో గుర్రపుడెక్కను తొలగించాలన్నారు. ఈ అంశాలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద 25న చేసే ధర్నాలో రైతులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల 3న కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా బ్లాక్ డే నిర్వహించాలని, ఈనెల 22, 23 తేదీల్లో తెనాలిలో జరిగే రైతు సంఘ జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నాయకులు సాంబిరెడ్డి, జానారెడ్డి, బ్రహ్మారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

వ్యవసాయ రంగ సమస్యలపై స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకటశివరావు అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూఖరీఫ్ సీజన్ సెప్టెంబర్‌తో ముగుస్తుండగా ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు వంటివి అందించిన దాఖలాలు లేవని అన్నారు. నాగార్జునసాగర్ నుండి నీరు విడుదల చేయకపోవడంతో సాగు విస్తీర్ణం సగానికి తగ్గిపోయిందని, నీరు లేక ఏ పంట వేయాలో తెలీక రైతులు అయోమయంలో ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. వ్యవసాయ అధికారులు కూడా ఏ పంటలు వేయాలో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఆరేళ్ల నుండి పంటలు సరిగా పండక పోవడం వల్ల రైతుల ఆత్మహత్యలు పెరిగిగాయని, ఈ పరిస్థితుల్లో రుణమాఫీ జరిగితేనే రైతులు వ్యవసాయాన్ని కొనసాగించగలుగుతారని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్తును ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని, దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు, భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందించాలన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాలని, రబీలో పంటలు వేసేందుకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు, ఉపాధి హామీ పథకంలో అదనంగా వంద రోజులు పనులు చూపించాలని, వ్యవసాయ కార్మికుల జీవనోపాధికి ప్రతి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి పాడి రైతుకు లీటరుకు రూ.4 బోనస్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. వెంకటశివరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగింపునకు అవసరమైన భూసేకరణకు వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. రైతు సమస్యలపై 20, 21వ తేదీలలో రైతు భరోసా కేంద్రాల వద్ద ఆందోళనలు చేస్తామని, 25న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, రైతులు అధికంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో గుంటూరు ఛానల్ సాధన సమితి నాయకులు కె.హరిబాబు, కౌలు రైతు సంఘం నాయకులు కె.శివనాగేశ్వరరావు, సిఐటియు నాయకులు డి.రమేష్‌బాబు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జె.రామారావు, కె.శ్రీనివాస రావు, సిహెచ్.యానాదులు, సిహెచ్.సురేంద్ర, పి.శేషగిరి రావు, బి.భోగేశ్వరరావు, జి.అమ్మయ్య పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి



ప్రతి ఇంట్లోని కుటుంబీకులు ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా పట్టణంలో ఇంటింటి సర్వేను చేపట్టారు. సర్వేను ఇందిరానగర్ డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ పి.అనూష ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపేట, గండాలయపేట, ద్వారకా నగర్, ఇందిరానగర్, వీవర్స్ కాలనీ, ఎల్బి నగర్లలో ఎఎన్ఎంలు, ఆశాలు, వాలంటీర్లు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తారన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి టోకెన్ ఇచ్చి వారికి వచ్చేనెల 3వ తేదీన గణపతి నగర్‌లోని ఇందిరానగర్ యూపీహెచ్సీ వద్ద వైద్యశిబిరంలో నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు ఇస్తామని తెలిపారు. సర్వే బృందానికి ప్రజలు సహకరించాలని, సర్వే సమయంలో ఇంట్లో లేనివారు మైద్యశిబిరం జరిగే రోజు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 105 రకాల మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపవర్‌వైజర్ జయలక్ష్మి, ఎఎన్ఎంలు విజయకుమారి, వనజ, ఆశా వర్కర్ లక్ష్మీకాంతం, వాలంటీర్ సీతాదేవి పాల్గొన్నారు.

వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ



ప్రజాశక్తి - మంగళగిరి

వినాయక చవితి సందర్భంగా ఆదివారం రాత్రి బీసీ సంక్షేమ సంఘం, వస్త్ర కళ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లోని షాపింగ్ మాల్ వద్ద ఉచితంగా వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షులు కాండ్రు కమల, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, వస్త్ర కళా షాపింగ్ మాల్ యజమాని టి.కిరణ్, విజయ హెల్త్ కేర్ ప్రతినిధి కె.స్వాతి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కె.శివరాం బాబాజీ, ఎ.శివాజీ పాల్గొన్నారు.

నేడు మట్టి ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని హెచ్‌పి పెట్రోల్ బంద్ వద్ద, ఉండవల్లి సెంటర్ శుభోదయ సూపర్ మార్కెట్ వద్ద మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మట్టి గణపతి విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని రోటరీ క్లబ్ అధ్యక్షుల పి.కిరణ్‌కుమార్, కార్యదర్శి చంద్ర ఓబుల్‌రెడ్డి కోరారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని సిఇఎ (సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షనల్ యాక్టివిటీస్) ఆధ్వర్యంలో అధ్యాపకులకు, విద్యార్థులకు ఆదివారం 1500 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన ఎకో ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాల ప్రాముఖ్యతను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల అది నీటి వనరులకు హాని కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వావిలాల గోపాలకృష్ణయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - గుంటూరు



ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు వావిలాల గోపాల కృష్ణయ్యను నేటి రాజకీయ నేతలు ఆదర్శంగా తీసుకోవాలని జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య118 జయంతి సందర్భంగా గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో ఆయన చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమములో, నాగార్జునసాగర్ నిర్మాణంలో, సహకార ఉద్యమాల్లో, సారా వ్యతిరేక ఉద్యమంలో, గ్రంథాలయ ఉద్యమంలో వావిలాల గోపాలకృష్ణయ్య క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నిడారంబర జీవితాన్నే గడిపారన్నారు.



దీక్షా పరులతో మాట్లాడుతున్న చేబ్రోలు తహశీల్దార్

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల కేంద్రమైన చేబ్రోలులో ఎంఆర్‌పిఎస్ చేపట్టిన రిలేదీక్షలు ఆరో రోజుకు చేరాయి. శిబిరాన్ని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ సందర్శించి మాట్లాడారు. నాయకులు ఎం.హృదయరాజు మాదిగ, జి.వాసు మాదిగ, ఎం.మనోహర్‌బాబు, కె.ఆదాం మాదిగ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈనెల 18వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ సెంటర్లో చేపట్టిన దీక్షలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. శిబిరాన్ని ఎంఇఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.రామారావు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ విక్టర్‌పాల్, కె.నాగేశ్వరావు, నతానియలు, శ్యామల, భాస్కర్, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో బంగారు భవిష్యత్

ప్రజాశక్తి - పెదనందిపాడు

పుస్తక పఠనం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని హెడ్ మాస్టర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖగ్రంథాలయంలో ఆదివారం 'చదువంటే మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు చదివే అలవాటును పెంచడానికి గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగ పడతాయని చెప్పారు. నీతి కథలు, కథనాలు, నీతి పద్యాలు, వంటి పుస్తకాలు చదవడం వలన విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమానికి గ్రంథాలయ నిర్వాహకులు పి.సుభాషిణి అధ్యక్షత వహించగా మంజుల, రామస్వామి పాల్గొన్నారు.



నేటి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయం, గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను వినాయక చవితి నేపథ్యంలో ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు.



గుండె ఆపరేషన్లు చేయించుకున్న వారితో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

జిజిహెచ్‌లో ప్రతిరోజూ గుండె ఆపరేషన్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో ప్రతిరోజూ గుండె మార్పిడి ఆపరేషన్‌లు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం సిటి-ఐసియు (కార్డియో థోరాసిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ను ఆయన సందర్శించారు. గుండె ఆపరేషన్‌లు చేయించుకున్న ముగ్గురి ఆరోగ్య పరిస్థితి గురించి నేరుగా వారితోనే మాట్లాడి తెలుసుకున్నారు. ముగ్గురి ఆరోగ్య పరిస్థితి సక్రమంగా ఉండటంపై వైద్యులను ఆయన అభినందించారు. ఈ విభాగాన్ని పటిష్టం చేసేందుకు ఒక అసోసియేట్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కేటాయించడంపై డిఎంఇకు కృతజ్ఞతలు తెలిపారు. గుండె మార్పిడి వైద్య నిపుణులు పద్మశ్రీ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే వద్ద కొత్తగా వచ్చే వైద్యులు మెలకువలను నేర్చుకోవాలని ఆయన సూచించారు. సిటి-ఐసియు విభాగంలో మత్తు వైద్యులు డాక్టర్ రామరాజు రోగులకు దగ్గర ఉండి పర్యవేక్షణ చేస్తుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మత్తు విభాగం ఒక బృందంగా ఏర్పడి వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలని సూచించారు. త్వరలో ఇంజినీరింగ్ శాఖాధికారులతో చర్చించి ఈ విభాగంలో మార్పులు చేర్పులు చేస్తున్నామని చెప్పారు. సూపరింటెండెంట్ వెంట నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా బేగం ఉన్నారు.

అక్రమ వ్యాపారాలపై నిఘా

- రేషన్ బియ్యాన్ని దారిమళ్లిస్తే చర్యలు
- నకిలీ టీ పొడి విక్రేతలపై దృష్టి
- బయోఉత్పత్తులపై విస్తృత తనిఖీలు
- ప్రజాశక్తితో విజిలెన్స్ ఎస్‌పి ఈశ్వరరావు

నకిలీ ఉత్పత్తులు విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఉమ్మడి జిల్లా విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్‌పి కె.ఈశ్వరరావు తెలిపారు. రేషన్ బియ్యం దారిమళ్లిస్తున్న వారిపై నిఘా ఉంచామని, సమాచారం రాగానే వీరిపై దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బయో ఉత్పత్తులు, నకిలీ టీ పొడి విక్రేతలపై ఇటీవల దాడులు చేసి పెద్ద ఎత్తున సరుకు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.





జిల్లాలో ఎన్ని బయో ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు?

అనుమతులు లేకుండా బయో ఉత్పత్తులు తయారు చేసి అమ్ముతూ రైతులను మోసగిస్తున్నారు. రైతులు, డీలర్లు అప్రమత్తంగా ఉండాలి. ఈ అంశంపై నర్సరావుపేటలో అవగాహన సదస్సు నిర్వహించాం. గత రెండు నెలల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు రూ.7 కోట్ల బయో ఉత్పత్తులను, నకిలీ ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నాం. గుంటూరు కేంద్రంగా నకిలీ బయో ఉత్పత్తుల తయారీ, విక్రయాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. తెలంగాణలోని హైదరాబాద్ పరిసరాల్లో కొన్ని కంపెనీలు బయో ఉత్పత్తులకు లైసెన్సులు పొంది అనుబంధ తయారీ కేంద్రాలను పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. వీరికి అనుమతులు లేవు. ఎక్కడోఒక చోట అనుమతి తీసుకుని గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో విక్రయాలు చేస్తుంటారు. కాలం చెల్లిన ఉత్పత్తులకు ప్యాకింగ్ మార్పుచేసి తిరిగి కొత్త గడువు తేదీని ముద్రించి పలు దుకాణాల్లో విక్రయిస్తున్నట్టు గుర్తించాం. ఈనెల ఒకటో తేదీన బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం ముప్పవరంలో రూ.5 కోట్ల బయో ఉత్పత్తులు, ముడిసరుకు, నకిలీ ఎరువులు స్వాధీనం చేసుకున్నాం. రాజుపాలెం, యాజిలి, కంటెపూడి, గుంటూరు, గోరంట్ల తదితర ప్రాంతాల్లో మరో రూ.2 కోట్ల విలువైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నాం.

ఎన్ని ఉత్పత్తులకు అనుమతి ఉంది?

47 రకాల బయో ఉత్పత్తులకు ఆయా రాష్ట్రాల్లో కంపెనీలకు అనుమతి ఇస్తోంది. అయితే వందల సంఖ్యలో ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తున్నాయి. పల్నాడు, గుంటూరు జిల్లాలో వాణిజ్య పంటలు ఎక్కువగా పండించడం వల్ల ఎరువులు, పురుగు మందుల వినియోగం కూడా ఎక్కువగా ఉంటోంది. దీనిని ఆసరాగా చేసుకుని ఈ ప్రాంతంపై బయో ఉత్పత్తుల తయారీ, విక్రయాలు భారీగా జరుగుతున్నాయి. వీరి మూలాలను కనుగొంటున్నాం. ముడిసరుకును కూడా గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నాం.

నకిలీ సిగరెట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి?

వివిధ ప్రాంతాల్లో నకిలీ సిగరెట్లు విక్రయాలు చేస్తుండగా పట్టుకున్నాం. చిలకలూరిపేట, వరగానిలో ఒక వ్యక్తి నకిలీ సిగరెట్ల విక్రయాలు చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో పట్టుకున్నాం. ఐటిసి బ్రాండ్ పోలిన నకిలీ సిగరెట్స్ అక్రమంగా తయారు చేసిన ఇతర బ్రాండ్ సిగరెట్స్ అమ్ముతున్నట్టు కనుగొన్నాం. పలువురిపై కేసులు నమోదు చేశాం. మొత్తం రూ.16 లక్షల నకిలీ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నాం.

రేషన్‌బియ్యం ఇతర ప్రాంతాలకు తరలింపు?

పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ సరఫరాచేసే వాహనదారులు, డీలర్లు, కొంతమంది అక్రమార్కులు దారిమళ్లిస్తున్నట్టు వస్తున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఈ అక్రమ వ్యాపారంపై దృష్టిపెట్టాం. ఇటీవల చెరుకుపల్లి మండలం కనగాల నుంచి గుజరాత్‌కు ఎగుమతి చేస్తున్న వ్యాపారిని పట్టుకున్నాం.

నాణ్యత లేని టీ పొడులు విక్రయాలు?

నాణ్యత లేని టీపొడి విక్రయాలు జరుగుతున్నాయి. సత్తెనపల్లి, నర్సరావుపేటలో ఇటీవల పట్టుకున్నాం. టీపొడి కొనుగోలు కూడా వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

శ్రామిక మహిళలు ఐక్యంగా పోరాడాలి



సదస్సులో మాట్లాడుతున్న దయా రమాదేవి

ప్రజాశక్తి-గుంటూరు

శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శ్రామిక మహిళలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు దయా రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో రమాసుష్మ అధ్యక్షతన జరిగిన శ్రామిక మహిళ జిల్లా సదస్సులో రమాదేవి మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు ఉద్యోగ భద్రత లేకపోవటం బాధాకరమన్నారు. మహిళలు, పురుషులు కలిసి పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలనే నిబంధనను పట్టించుకోవటం దారుణమన్నారు. శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. మహిళల పట్ల వివక్షత చూపించే పనులను నిషేధించాలని, మహిళలకు జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళం విప్పాలని సూచించారు. మహిళలు పనిచేస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్మిక ఉద్యమ నాయకులు పర్సా సత్యనారాయణ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జరిగే బహుముఖ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో శ్రామిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షకీలా, కాంట్రాక్ట్ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆర్.స్వాతి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు టి.రాధా, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.నేతాజి, డి.లక్ష్మీనారాయణ ప్రసంగించారు.



ఘనంగా సిమ్స్ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

సిమ్స్ విద్యా సంస్థల స్నాతకోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2022-23 సంవత్సరంలో ఉత్తీర్ణులైన 125 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ హాజరై నర్సింగ్, ఫిజియోథెరపి, ఫార్మసీ, లైఫ్ సైన్సెస్ విభాగాలకు చెందిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు. కార్యక్రమంలో సిమ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ బి.భరత్‌రెడ్డి, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష, ప్రిన్సిపాల్ ఇ.సునీత, డాక్టర్ బి.సంధ్య, బి.తంగబాల పాల్గొన్నారు.

జాతీయ నిరుద్యోగ దినోత్సవంగా మోడీ పుట్టిన రోజు

ప్రజాశక్తి - గుంటూరు

ఉద్యోగాల పేరుతో యువతను ప్రధాని మోడీ మోసం చేసినందుకు ఆయన పుట్టినరోజు సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కట్టా జవహర్ బాబు ఆధ్వర్యంలో 'జాతీయ నిరుద్యోగ దినోత్సవం' పేరుతో నిరసన తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిరసనలో జవహర్ బాబు మాట్లాడుతూ 2014 ఎన్నికల సందర్భంగా బిజెపి అధికారంలోకి రాగానే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నరేంద్రమోడీ హామీనిచ్చారని, దాని ప్రకారం తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా 8 లక్షల ఉద్యోగాలే ఇచ్చారని విమర్శించారు. ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగ శాతం పెరిగిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్‌సెల్ చైర్మన్ జి.అశోక్ ఆనంద్, నాయకులు జగదీష్ నాయుడు, ఎస్.జయరాం, డాక్టర్ జాన్‌పీటర్, మహమూద్, మహబూబ్ అలీ పాల్గొన్నారు.

